క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

షాబాద్: విద్యుత్ తీగల కింద ఉన్న చెట్లకొమ్మల తొలగింపు కారణంగా మండల కేంద్రంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని, వినియోగదారులు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

ఉచిత వైద్య శిబిరం

కొందుర్గు: మండలంలోని ఉత్తరాసిపల్లిలో షాద్‌నగర్ పట్టణానికి చెందిన హ్యాపీ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా డాక్టర్లు శశికాంత్, సునీత రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. శిబిరానికి హాజరైన 237 మంది రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు ఆసంఖాన్, రవీందర్, ప్రశాంత్, సన, గ్రామస్తులు అంజిరెడ్డి, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయంలో అన్నప్రసాదానికి విరాళం


విరాళం అందజేస్తున్న పాండురంగం

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్‌లోని కట్ట మైసమ్మ దేవాలయంలో భక్తులకు ప్రసాద వితరణ నిమిత్తం పట్టణానికి చెందిన వ్యాపారవేత్త పలబట్ల పాండురంగం, వెంకటమణి దంపతులు శనివారం రూ.2లక్షల విరాళం అందజేశారు. దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నలమోని శ్రీధర్ ఆధ్వర్యంలో పాండురంగంను కలిసి దేవాలయ అభివృద్ధికి సహకరించాలని కోరినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు ప్రసాద వితరణ నిమిత్తం వారు రూ.2లక్షల విరాళం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, మంచిర్యాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న నాయకులు

షాబాద్: నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరమని చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 15 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.12లక్షల 22 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను వారు అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రాంరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అక్తర్‌పాషా, శ్రీరాంరెడ్డి తదితరులు ఉన్నారు.

వర్గీకరణకు కాంగ్రెస్ అనుకూలం

ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు సురేందర్

కొత్తూరు: ఎస్సీ వర్గీకరణ అంశంలో కాంగ్రెస్ పార్టీ అనుకూలంగా ఉన్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం సంతోషకరమని ఆ పార్టీ ఎస్సీ సెల్ షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు కర్రోళ్ల సురేందర్ అన్నారు. ఇందులో భాగంగా ఆయన కొత్తూరు పట్టణంలో శనివారం పలువురు నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 7న వర్గీకరణ కోసం జరగనున్న వేల గొంతులు–లక్ష డప్పుల సభలో కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతగా తీర్మానం చేస్తున్నట్లు వివరించారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వగానే రాష్ట్ర ప్రభుత్వం సైతం అనుకూలమని ప్రకటించడం గొప్ప విషయమన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్సీలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో నాయకులు చిల్కమర్రి నర్సింలు, హసన్, తేజేశ్వర్, శివ, రాజేందర్, మహిపాల్ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం


సునీతను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సునీతను శనివారం బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు హరిభూషణ్ ఆధ్వర్యంలో నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యలపై కమిషనర్‌తో చర్చించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింలు, రాము, రాజు, సురేష్, విజయ్, శివప్రసాద్, రామకృష్ణ పాల్గొన్నారు.

స్కూళ్లకు స్కావెంజర్లు


మండల విద్యావనరుల కేంద్ర భవనం

- పాఠశాలల్లో తీరిన పారిశుద్ధ్య సమస్యలు
- విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధులు
- అమ్మ ఆదర్శ కమిటీలకు నిర్వహణ బాధ్యత

కేశంపేట: గతంలో పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం స్కావెంజర్లను నియమించి, వారితో కొద్దిరోజులు పనులు చేయించుకొని 2021లో తొలగించారు. అప్పటి నుంచి గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ చేయాలని గత ప్రభుత్వం సూచించింది. గ్రామ పంచాయతీల్లో సరైన సిబ్బంది లేకపోవడం, ఉన్నవారు కూడా బాత్‌రూంలను క్లీన్ చేసేందుకు ఇష్టపడకపోవడం లాంటి కారణాలతో పారిశుద్ధ్య నిర్వహణ గాలిలో దీపంగా మారింది. ప్రస్తుత విద్యాసంవత్సరంలో పాఠశాలల్లో పాఠశాల పరిశుభ్రత, పారిశుద్ధ్యం కోసం వ్యక్తిని నియమించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పారిశుద్ధ్య నిర్వహణకు స్కూల్ ఫెసిలిటీ మెయింటెన్స్ నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తోంది. పాఠశాల అవసరాల కోసం పనిచేస్తున్న వ్యక్తికి పారితోషకాన్ని ఇచ్చే బాధ్యత అమ్మ ఆదర్శ కమిటీలకు ప్రభుత్వం అప్పగించింది. ప్రభుత్వం ద్వారా పాఠశాలలకు వస్తున్న సమగ్ర శిక్ష నిధులకు అదనంగా పాఠశాల అవసరాల నిర్వహణకు అందిస్తోంది.

తీరిన సమస్యలు..

పాఠశాల అవసరాల కోసం ఏర్పాటు చేసిన వ్యక్తితో పాఠశాల ఆవరణలో మొక్కలకు నీళ్లు పోయడంతో పాటు పాఠశాల పరిసరాలను శుభ్రం చేయడం, మరుగుదొడ్లను శుభ్రం చేయడం తదితర పనులు చేపట్టనున్నారు. గతంలో వీటి నిర్వహణను ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ఇవ్వడంతో చాలా గ్రామాల్లో వారంలో ఒక్కరోజు మాత్రమే వీటి నిర్వహణ జరిగేది. కొన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, మరికొన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు కలిసి చందాలు వేసుకొని స్కావెంజర్లను గతంలో ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం పాఠశాల అవసరాల కోసం వ్యక్తిని ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో పాఠశాలలు పరిశుభ్రంగా మారాయి.

మండలంలో..

మండల పరిధిలోని 29 గ్రామ పంచాయతీల పరిధిలో 08 ఉన్నత పాఠశాలలు, 08 ప్రాథమికోన్నత పాఠశాలలు, 24 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 3వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. మండలంలో సుమారుగా 45 మందిని పాఠశాల అవసరాల కోసం నియమించారు.

నిధులు ఇలా..

రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం పాఠశాల అవసరాల కోసం వ్యక్తిని నియమించుకునేందుకు జీఓ 21ని విడుదల చేసింది. జిల్లా మినరల్ ఫండ్ ట్రస్ట్ ద్వారా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధులను విడుదల చేస్తున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 01 నుంచి 30 మంది వరకు ఉంటే 3వేలు, 31 నుంచి 100 వరకు ఉంటే 6వేలు, 101 నుంచి 250 మంది ఉంటే 8వేలు, 251 నుంచి 500ల మంది ఉంటే 12వేలు, 501 నుంచి 750 వరకు విద్యార్థులు ఉంటే 15వేలు, 750 కంటే ఎక్కువ ఉంటే 20వేలను నెలకు చొప్పున అందిస్తారు. అమ్మ ఆదర్శ కమిటీలు ఈ నిధులను ప్రధానోపాధ్యాయుల భాగస్వామ్యంతో ఖర్చు చేస్తున్నారు. అయితే స్కావెంజర్లతో కమిటీ ఎలాంటి ఒప్పందం చేసుకునే వేసులుబాటు లేదు.

అమ్మ కమిటీలదే బాధ్యత



పాఠశాలలో అవసరాల కోసం వ్యక్తిని నియమించుకోమని ప్రభుత్వం తెలిపింది. వారికి ఎలాంటి అటెండెన్స్ ఉండదు. వారికి నేరుగా జీతాలు ఇవ్వడం లేదు. పాఠశాలలో విధులను నిర్వహిస్తున్న వారి బాధ్యతను అమ్మ ఆదర్శ కమిటీలు పర్యవేక్షిస్తున్నాయి. వీరిని నియమించడంతో పాఠశాలలు పరిశుభ్రంగా మారాయి.

– చంద్రశేఖర్, మండల విద్యాధికారి

మంచినీటి సమస్య రాకుండా చూడాలి

మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్


చిలుకూరులో అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

మొయినాబాద్: వేసవిలో మంచినీటి సమస్య రాకుండా ముందు నుంచే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖాజా మొయిజుద్దీన్ అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు, మొయినాబాద్, పెద్దమంగళారం తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఉన్న కార్యాలయాల్లో వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం, మంచినీటి సమస్య లేకుండా చూడాలన్నారు. మురుగు కాల్వలు, చెత్తాచెదారం ఎప్పటికప్పుడూ శుభ్రం చేయించాలని సూచించారు. ఆయన వెంట అధికారులు వెంకటేశ్, సుదర్శన్, సిబ్బంది రాజేశ్ ఉన్నారు.

హిమాయత్‌నగర్‌లో..

మొయినాబాద్‌రూరల్: మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామాన్ని మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖాజా మొయిజుద్దీన్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సంధ్యారాణి, సుహాసిని, అజీజ్‌నగర్ పంచాయతీ కారోబార్ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

స్టేడియం నిర్మాణానికి స్థల పరిశీలన


స్టేడియం నిర్మాణ స్థలంలో అధికారులు

కొందుర్గు: కొందుర్గు మండల కేంద్రంలో స్టేడియం ప్రతిపాదిత స్థలాన్ని శనివారం అధికారులు పరిశీలించారు. కొందుర్గు పడమర శివారులోని సర్వే నెంబర్ 19లో గల 7 ఎకరాల 13 గుంటల స్థలాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచన మేరకు రెవెన్యూ అధికారులు ఇదివరకే స్టేడియం కోసం ప్రతిపాదించారు. కాగా శనివారం జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థలాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్టేడియం ఏర్పాటుకు స్థలం అనుకూలంగా ఉన్నట్లు ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కార్యాలయం సూపరింటెండెంట్ కృష్ణారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ సుధాకర్, డిప్యూటీ తహసీల్దార్ రాకేశ్, ఆర్ఐ శివ, సర్వేయర్ ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకులు రాములుగౌడ్, గోవర్ధన్‌గౌడ్, నరేందర్, జీబీ కృష్ణ, వేణుగోపాల్‌గౌడ్, సరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

బీజేపీ యువ నాయకుడు వైభవ్‌రెడ్డి


వైద్యశిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చేవెళ్ల: గ్రామాల్లో ఉండే పేద ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో శనివారం మల్గారి వైభవ్‌రెడ్డి ఆధ్వర్యంలో టీఎక్స్ ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని బీజేపీ మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో ప్రజలకు వివిధ రకాల డాక్టర్లు వైద్యపరీక్షలు చేసి సలహాలు అందించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు వ్యూహారెడ్డి, రోహిత్‌రెడ్డి, శివకుమార్, రక్షిత్‌రెడ్డి, వినయ్, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకారం


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న సంస్థ ప్రతినిధులు

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలను ప్రైవేట్‌కు దీటుగా అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేసిన ఎన్‌సీఆర్ అట్లియోస్ సంస్థ ప్రతినిధుల సహకారం మరువలేనిదని కుమ్మెర మాజీ సర్పంచ్, జిల్లా బీసీ సేన జిల్లా అధ్యక్షుడు జూలూరి పాండుగౌడ్ అన్నారు. మండలంలోని కుమ్మెర గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను కొన్ని రోజులుగా ఎన్‌సీఆర్ అట్లియోస్ ఇండియా అనే సంస్థ ప్రతినిధులు 25 లక్షల రూపాయలతో పాఠశాలకు పెయింటింగ్, కాంపౌండ్, బాత్‌రూమ్‌లు, కంప్యూటర్స్, టీవీ తదితర అన్ని సౌకర్యాలు కల్పించి శనివారం గ్రామ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను ఎంపిక చేసుకొని ప్రైవేట్‌కు దీటుగా మార్చిన కంపెనీ ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్‌సీఆర్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ అకోశ్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయటంతో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బలరాం, నాయకులు, యాదవ్, ఉపాధ్యాయులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణపై మొండి వైఖరి



తెలంగాణకు కేంద్ర బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయిస్తారని గంపెడు ఆశలతో ఉంటే కేంద్రం ప్రకటించిన బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయి చూపించింది. కోట్లలో బడ్జెట్ పెట్టినప్పటికీ కేవలం కేంద్రం తన ప్రభుత్వాన్ని కాపాడుకోవటం కోసమే అన్నట్లుగా ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు మాత్రమే పెద్దపీట వేశారు. నిర్మాలా సీతారామన్ తెలంగాణపై వివక్ష చూపడం బాధాకరం. కనీసం తెలంగాణ రాష్ట్రం పేరు కూడా కేంద్ర ఆర్థిక మంత్రి ప్రస్తావించలేదు.

– తరుణ్, యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి

అన్నివర్గాల ప్రజలకు మేలు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు మేలుచేసే విధంగా ఉంది. దేశ ప్రయోజనాలు, ప్రజల అభివృద్ధికి తగిన విధంగా బడ్జెట్‌ను రూపొందించారు. ఎంతో ఆశగా ఎదురుచూసినా ప్రజల ఆదాయ పన్ను మినహాయింపును 12లక్షలకు ఊహించని విధంగాపెంచారు. ఇది అందరూ హర్షించే విధంగా ఉందని పేర్కొన్నారు.

– అత్తెల్లి అనంత్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు, చేవెళ్ల

కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలి

షాబాద్: పార్టీ బలోపేతానికి కాంగ్రెస్ కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలంతా ఐక్యంగా ఉంటూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వివరించారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు కలిసి పనిచేస్తేనే విజయం సాధిస్తామన్నారు. కార్యకర్తల సమస్యలు తెలుసుకొని దశలవారీగా పరిష్కరిస్తానని హామీనిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద మండల పరిధిలోని ఏట్ల ఎర్రవల్లి గ్రామాన్ని ఎంపిక చేసి, గ్రామంలోని 573 మంది రైతులకు రైతు భరోసా డబ్బులు జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రాంరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అక్తర్‌పాషా, శ్రీరాంరెడ్డి, మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, గుండాల అశోక్, సీనియర్ నాయకులు రవీందర్, మల్లారెడ్డి, ఆస్మత్‌పాషా, చేవెళ్ల నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు పెంటారెడ్డి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్లు మంగలి చెన్నయ్య, పామెన నర్సింలు తదితరులు ఉన్నారు.

నక్షబాట కబ్జాపై చర్యలు తీసుకోండి

కేశంపేట: కేశంపేట మండలం అల్వాల గ్రామ పరిధిలోని నక్షబాటను కబ్జా చేసేందుకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం రైతులు తహసీల్దారు ఆజంఅలీకి ఫిర్యాదు చేశారు. గ్రామ శివారులోని సర్వే నంబర్ 191, 194, 159లో 30 ఎకరాల భూమికి ఆనుకొని ఉన్న నక్షబాటను అల్వాల గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. నక్షబాట కబ్జాతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, కబ్జాకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

చిన్నషాపూర్‌ను జీపీగా ఏర్పాటు చేయాలని నిరసన


నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

మొయినాబాద్: మొన్నటి వరకు పెద్దమంగళారం గ్రామ పంచాయతీకి అనుబంధ గ్రామంగా ఉండి కొత్తగా ఏర్పాటైన మొయినాబాద్ మున్సిపాలిటీలో కలిపిన చిన్నషాపూర్ గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. శనివారం గ్రామంలోనే గ్రామస్తులంతా బైఠాయించి నిరసన తెలిపారు. ప్రత్యేక రెవెన్యూ పరిధి ఉన్న చిన్నషాపూర్‌ను గ్రామ పంచాయతీగా చేయాలన్నారు. ఎన్నో ఏళ్లుగా అనుబంధ గ్రామంగా ఉన్న చిన్నషాపూర్ అభివృద్ధికి నోచుకోలేదని, గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేస్తే అభివృద్ధి జరుగుతుందన్నారు. మున్సిపాలిటీలో కలపడంతో చిట్ట చివరన ఉన్న తమ గ్రామాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోరన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా శివాలయ వార్షికోత్సవం

నందిగామ: మండల పరిధిలోని బుగ్గోనిగూడలో శివాలయాన్ని నిర్మించి రెండు ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆలయంలో ద్వితీయ వార్షికోత్సవాన్ని శనివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో గ్రామస్తులు పెద్దఎత్తున సాముహిక పూజలు, వ్రతాలు, హోమాలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేకంగా పూజలు కొనసాగించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

‘లక్ష డప్పుల’ను విజయవంతం చేయండి


చేవెళ్లలో డప్పు చప్పుళ్లతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి శివశంకర్‌మాదిగ


కొందుర్గులో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

చేవెళ్ల: ఎస్సీ వర్గీకరణ అడ్డుకోవాలని చూసే శక్తుల గుండెలు దద్దరిల్లేలా ఈ నెల 7న హైదరాబాద్‌లో జరిగే మాదిగల ప్రదర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి బి. శివశంకర్‌మాదిగ అన్నారు. మండల కేంద్రంలో శనివారం మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ మాదిగ ఆధ్వర్యంలో లక్ష డప్పులు వేల గొంతుల ప్రదర్శన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం చేవెళ్లలో ఎమ్మారీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు ఎమ్మార్పీఎస్ చేపట్టిన 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి సుప్రీంకోర్టు తీర్పుతో న్యాయం దక్కిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి చేసి తమ ఆవేదనను సమాజానికి చాటడానికే వర్గీకరణ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తున్నట్లు వెల్లడించారు. ఫిబ్రవరి 7న ప్రతీ మాదిగబిడ్డ చంకన డప్పుతో నగరానికి రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చేవెళ్ల గ్రామంలోని ప్రధాన రహదారిపై డప్పుల చప్పులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి కె.రామస్వామి, మండల సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

చలో హైద్రాబాద్‌ను విజయవంతం చేయండి

కొందుర్గు: ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలనే డిమాండ్‌తో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో లక్ష డప్పులు–వేల గొంతుల పేరుతో ఈ నెల 7న చేపట్టనున్న చలో హైద్రాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఆనంద్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహంవద్ద చలో హైద్రాబాద్ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. నాయకులు పాల్గొన్నారు.

వర్గీకరణను తక్షణమే అమలు చేయాలి

నందిగామ: ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అశోక్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన నందిగామలో శనివా రం ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే వెయ్యి గొంతులు–లక్ష డప్పులు మహాప్రదర్శనకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను అశోక్ మాదిగ విడుదల చేశారు. కార్యక్రమంలో రమేశ్, అర్జున్, కృపా నందం, మహేశ్, బుగ్గయ్య, యాదయ్య పాల్గొన్నారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్: ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే వేల గొంతులు–లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మహేందర్‌మాదిగ అన్నారు. లక్ష డప్పులు కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను శనివారం మండల కేంద్రంలో నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ కార్యదర్శి సునీల్‌కుమార్‌మాదిగ, నాయకులు ఎం.రవిమాదిగ, బోడ భిక్షపతి మాదిగ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.